క్లుప్తంగా

భక్త మార్కండేయుడికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని తంగెళ్లపల్లిలోని శ్రీభక్త మార్కండేయ ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతియేడాది లాగానే సూర్యాస్తమయం తరువాత భక్తులు ఆకాశ దీపాం వెలిగించి, ధ్వజారోహణం చేశారు. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రధాన అర్చకులు వెల్ది రాజేశం, అర్చనపల్లి రాజు, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

– డీబీఎఫ్ జిల్లా నేత వేణు

గజ్వేల్: రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డీబీఎఫ్(దళిత బహుజన ఫ్రంట్) జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు పిలుపునిచ్చారు. మండలంలోని బెజుగామ గ్రామంలో శనివారం రాజ్యాంగ విలువల పరిరక్షణ ప్రచారోద్యమం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారానే అన్ని వర్గాల హక్కులకు రక్షణ ఉంటుందన్నారు.

రూ.2.50లక్షల ఎల్వోసీ అందజేత



చెక్కును అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన బచ్చుగారి చంద్రశేఖర్‌కు మంజూరైన రూ.2.50లక్షల సీఎం సహాయనిధి చెక్కును కాంగ్రెస్ పార్టీ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి శనివారం లబ్ధిదారుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకట్‌స్వామి గౌడ్, నాయకులు ప్రతాప్, వెంకటేశం, సురేందర్‌రెడ్డి, స్వామి, రమేశ్, రాజు, రాములు, నవీన్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి

పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం



కేక్ కట్‌చేస్తున్న చంద్రం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఆయన జన్మదిన వేడుకల్లో మాట్లాడుతూ ప్రతి నాయకుడు, కార్యకర్త పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్, గయజుద్దీన్, మధు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ మ్యాచ్‌లు

సిద్దిపేటజోన్: కొన్ని రోజులుగా జిల్లా కేంద్రంలోని క్రికెట్ స్టేడియంలో సీఎం రేవంత్ రెడ్డి క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నారు. శనివారం వివిధ జట్ల మధ్య హోరాహోరీగా మ్యాచ్‌లు కొనసాగాయి. ఉత్తమ ప్రతిభ చూపిన ఆటగాళ్లను నిర్వాహకులు జ్ఞాపికలతో అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, నిర్వాహకులు పాల్గొన్నారు.

పౌరహక్కులకు భంగం కలిగించొద్దు

మద్దూరు(హుస్నాబాద్): ఎవరి హక్కులకూ భంగం కల్గించొద్దని ఏఎస్ఐ విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని నర్సాయపల్లి గ్రామంలో పౌరహక్కుల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరహక్కులకు భంగం కల్గించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రమేశ్ పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని నలంద పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ నేత్ర వైద్యుడు డాక్టర్ అనంతచారి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ మల్లికార్జున్, హెచ్‌ఎం హరినాథ్, ఉపాధ్యాయులు, గౌసియాబేగం, అనిత, అమరిన్, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్లే టార్గెట్

గ్రామాల్లో జరుగుతున్న వాహనాల బ్యాటరీ దొంగతనాలు రైతుకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇంటి ఎదుట, వ్యవసాయ బావుల వద్ద భద్రంగా ఉంటుందని పార్కింగ్ చేసిన ట్రాక్టర్లనే దొంగలు టార్గెట్ చేస్తున్నారు. ఇటీవల దొంగతనాలు మరింత అధికమయ్యాయి. దొంగలించిన విలువైన బ్యాటరీలను వివిధ బ్యాటరీ షాపులకు అమ్ముతున్నారని ప్రచారం సాగుతోంది.

– మద్దూరు(హుస్నాబాద్):

- రాత్రి వేళల్లో బ్యాటరీల అపహరణ
- కొంత కాలంగా దుండగుల ఆగడాలు
- నిఘా పెట్టని పోలీసులు

మద్దూరు, దూల్మిట్ట మండలంలోని కొంత మంది బ్యాటరీ దొంగలుగా మారారు. పగటిపూట అన్నీ గమనించి రాత్రివేళ్లలో వాహనాల నుంచి బ్యాటరీలను చోరీ చేస్తున్నారు. పొలాల వద్ద ఉంచిన ట్రాక్టర్లు, ఇళ్ల వద్ద ఉంచిన ఆటోల నుంచి విలువైన బ్యాటరీలు మాయం అవుతున్నాయి. దీంతో వాహనాల యాజమానులు లబోదిబోమంటున్నారు. చేసేదేమీ లేక అప్పులుచేసి మరో బ్యాటరీలను కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు నిఘాపెట్టి బ్యాటరీ దొంగలపై దృష్టిసారించాలని కోరుతున్నారు.



బ్యాటరీ అపహరణకు గురైన ట్రాక్టర్

పెరిగిన దొంగతనాలు

సులువుగా వచ్చే డబ్బుల కోసం ఆశపడ్డ కొందరు ఈ చోరీలకు పాల్పడుతున్నారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ట్రాక్టర్, ఆటో బ్యాటరీలను దొంగతనం చేస్తున్నారు. ఒక్కో బ్యాటరీ(వాహనాన్ని బట్టి) రూ.6వేల నుంచి రూ.15వేల వరకు ఉంటుందని యజమానులు అంటున్నారు. కొంత కాలం నుంచి బావుల వద్ద కాపలా ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు.

తాజా చోరీలు

రెండుల్లోనే మండలంలోని మండల కేంద్రంలో 2, రేబర్తి గ్రామంలో 7, సలాఖపూర్ 5, మర్మాముల 5, ధర్మారం1, లద్నూరు 1, గాగిళ్లాపూర్ 1 కలిసి మొత్తం 22 ట్రాక్టర్ల బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. మర్మాముల గ్రామంలోనైతే ఓ ట్రాక్టర్ నుంచి బ్యాటరీ రాకపోవడంతో ట్రాక్టర్‌నే ధ్వంసం చేశారు.

దొంగలపై చర్యలు తీసుకోవాలి

కొద్దిరోజులుగా ట్రాక్టర్ల బ్యాటరీలు దొంగతనాలకు గురవుతున్నాయి. దీంతో మేము ఆందోళన చెందుతున్నాం. ఒక్కో బ్యాటరీ విలువ రూ.12వేల వరకు ఉంటుంది. ఆర్థికంగా నష్టపోవాలసిన పరిస్థితి. పోలీసు అధికారులు నిఘాపెట్టి దొంగతనాలను అరికట్టాలని కోరుతున్నాం.

– దాకూరి తిరుపతిరెడ్డి, రైతు, మర్మాముల



దర్యాప్తు చేస్తున్నాం

బ్యాటరీల దొంగతనాలకు సంబంధించిన బాధితులు ఇచ్చిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేశాం. త్వరలోనే విచారణ జరిపి దొంగలను పట్టుకుంటాం. రాత్రి వేళ్లలో ప్రత్యేకంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. నిఘాను మరింత ముమ్మరం చేస్తాం. త్వరలోనే దొంగతనాల నివారణకు కృషిచేస్తాం.

– షేక్ మహబుబ్, ఎస్ఐ, మద్దూరు

• నీటి వృథా.. తప్పని వ్యథ



ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం ఇంటింటికీ నీటి సరఫరా చేస్తోంది. కాని కొన్ని చోట్ల విలువైన నీరు వృథాగా పోతోంది. అరికట్టాల్సిన యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. చిన్నకోడూరు మండలంలోని సలెంద్రి వద్ద రహదారిపై మూడు రోజులుగా పైపులైన్ గేట్‌వాల్ వద్ద తాగునీరు వృథాగా పోతోంది. ఆ నీరు రోడ్డుమీద పారుతుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– చిన్నకోడూరు(సిద్దిపేట):

నాణ్యమైన భోజనం అందించాలి

- ఎంఈఓలు మాధవరెడ్డి, అంజాగౌడ్

జగదేవ్‌పూర్(గజ్వేల్)/మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ మాధవరెడ్డి ఆదేశించారు. జగదేవ్‌పూర్ ఆదర్శ పాఠశాలకు సంబంధించిన హాస్టల్‌ను శనివారం సందర్శించారు. భోజనం, నిత్యావసర సరుకులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర సరుకులు నాణ్యమైన వాటినే వాడాలన్నారు. మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా మండలస్థాయి అధికారులకు సమాచారం అందించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ ఖాజా మోహినొద్దీన్, వైద్యుడు సత్యప్రకాశ్, సిబ్బంది జితేందర్‌రెడ్డి, పాల్గొన్నారు. అదేవిధంగా అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఎంఈఓ అంజాగౌడ్ సందర్శించారు.



నిత్యావసర సరుకులను పరిశీలిస్తున్న అధికారులు

మధ్యాహ్న భోజనం, వంట సరుకులను పరిశీలించారు. తాజా కూరగాయలతో పౌష్టికాహారాన్ని అందిచాలని వంట కార్మికులను ఆదేశించారు. వంట గదుల చుట్టూ పెరిగిపోయిన ముళ్ళ చెట్లను, ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను పరిశీలించి తక్షణమే జేసీబీతో తొలగించి శుభ్రం చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజేందర్, ఫిజికల్ డైరెక్టర్ తోట వెంకట్‌రెడ్డి, టీచర్లు దయాసాగర్ రెడ్డి, స్వామి, పద్మావతి, భాగ్యవతి, సంతోషి, మేఘమాల తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీయడానికే సీఎం కప్



మాట్లాడుతున్న జయరాం

- ఎంపీడీఓ జయరాం

అక్కన్నపేట(హుస్నాబాద్): గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులలోని ప్రతిభను వెలికితీయాలనే ఉద్దేశ్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడాపోటీలు నిర్వహిస్తోందని, వాటిని ప్రజలంతా విజయవంతం చేయాలని ఎంపీడీఓ బానోతు జయరాం పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం క్రీడా పోటీల నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7, 8వ తేదీల్లో గ్రామస్థాయిలో పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన క్రీడాకారులను ఎంపిక చేయాలన్నారు. 11, 12, 13వ తేదీల్లో మండస్థాయిలో జరగనున్న పోటీలను విజయవంతం గా నిర్వహించాలని సూచించారు. క్రీడాకారులకు భోజన సదుపాయం కల్పిస్తామని, విజేతలను జిల్లాస్థాయికి పంపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ రంగనాయక్, ఎంపీఓ మోహన్‌నాయక్, వ్యాయమ ఉపాధ్యాయులు వెంకటనర్సయ్య, శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలతో చెలగాటం ఆడటం దారుణం

- ఏబీవీపీ నాయకుల నిరసన

దుబ్బాకటౌన్: గురుకుల విద్యార్థుల ప్రాణాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడటం దారుణమని ఏబీవీపీ నాయకుడు జిల్లెల ఫణీంద్ర గౌడ్ మండిపడ్డారు. ఇటీవల గురుకులంలో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు అనారోగ్యానికి గురికావడాన్ని నిరసిస్తూ శనివారం దుబ్బాక బస్టాండ్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 51 మంది విద్యార్థులు కలుషిత ఆహారంతిని మృతి చెందారన్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. వసతి గృహాల్లో నాణ్యత లేని భోజనం వడ్డిస్తున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం సరికాదని, విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడితే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అజయ్, జస్వంత్, హరీశ్ తదితరులున్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

ఆరోగ్య పరిరక్షణ కోసమే పరేడ్



సిబ్బందికి సూచనలిస్తున్న రాంచందర్‌రావు

- అదనపు డీసీపీ రాంచందర్‌రావు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆరోగ్య పరిరక్షణ కోసమే పరేడ్ నిర్వహిస్తున్నట్లు అదనపు డీసీపీ రాంచందర్ రావు అన్నారు. మండల పరిధిలోని పెద్దకోడూరు శివారులోని సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో జిల్లాలోని సివిల్, రిజర్వ్ పోలీస్, హోంగార్డు సిబ్బందికి శనివారం పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరేడ్ ఫిజికల్ ఫిట్నెస్‌తో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. సమయం దొరికినప్పుడల్లా వ్యాయామం చేయడం మంచిదన్నారు. వ్యాయామాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. మంచి శక్తి సామర్థ్యాలతో అనారోగ్యానికి గురి కాకుండా విధులు నిర్వహించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన భవనం సందర్శన

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న పీహెచ్‌సీ అదనపు నూతన భవన నిర్మాణాన్ని డీఎంహెచ్‌ఓ డా.పల్వన్ కుమార్ శనివారం సందర్శించారు. భవనంలోని వివిధ గదులు, వసతులను పరిశీలించారు. డిసెంబర్ 2న ప్రారంభించనున్నట్టు చెప్పారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రేవతి, డాక్టర్ తేజశ్విని, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా కమిషన్ పరిశీలన

దుబ్బాకరూరల్: మండలంలోని హబ్సిపూర్‌లోని మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాలను రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యులు జ్యోత్స్న, జీనత్ శుక్రవారం రాత్రి సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. డీఈఓ శ్రీనివాస రెడ్డి, విద్యాధికారి ప్రభుదాస్, ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ అసోసియేషన్ పనితీరు భేష్

వర్గల్(గజ్వేల్): రాష్ట్రంలోనే సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ పనితీరు బాగుందని రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని వీరేశ్ అన్నారు. మండలంలోని గౌరారంలో జిల్లా అధ్యక్షుడు ఎస్‌సీ సంతోష్‌గుప్తా అధ్యక్షతన శనివారం జరిగిన సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారుల కోసం కబడ్డీ మైదానం, ఇండోర్ స్టేడియం నిర్మిస్తామన్నారు. కబడ్డీ అసోసియేషన్ సహాయ కార్యదర్శిగా ఎన్నికైన శివకుమార్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సత్యం, ప్రేమ్ నారాయణ, మహేశ్, స్వామి, బాలకృష్ణ, చిన్ని కృష్ణ పాల్గొన్నారు.

గడువు పొడిగింపు

సిద్దిపేటకమాన్: జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీలో స్టెనో గ్రాఫర్ ఉద్యోగ దరఖాస్తు తేదీని 20వరకు పొడిగించినట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మృతి

కొమురవెల్లి(సిద్దిపేట): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలోని పద్మశ్రీ గార్డెన్ సమీపంలో బయటపడింది. శనివారం ఎస్ఐ రాజుగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం చేర్యాల మండలం పాత దొమ్మాటకు చెందిన పోలోజు ఉపేంద్ర చారి(40) కుటుంబంతో కలసి హైదరాబాద్‌లో కార్పెంటర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. వారం రోజుల క్రితం తన స్వగ్రామం దొమ్మాటకు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. అతడు అక్కడికి చేరకపోవడంతో నాలుగు రోజుల క్రితం చేర్యాల పోలీసు స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. శనివారం లభ్యమైన మృతదేహం దొమ్మాట వాసిదిగా గుర్తించారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

- సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

హుస్నాబాద్/జగదేవ్‌పూర్(గజ్వేల్): విద్యాశాఖలో సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలని ఉద్యోగ జేఏసీ నాయకులు పోలు స్వామి డిమాండ్ చేశారు. ఎంఆర్‌సీ కార్యాలయం ఎదుట శనివారం సమగ్ర శిక్ష ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100రోజుల్లోనే రెగ్యులర్ చేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అది వీలుకాని పక్షంలో వెంటనే స్కేల్ అమలు చేస్తామని హామీ ఇచ్చారని, అయితే అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి కావస్తున్నా హామీలు అమలు కాలేదని వాపోయారు. కార్యక్రమంలో రాజశేఖర్, సంజయ్, స్వామి, స్వప్న, యాదగిరి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జగదేవ్‌పూర్ మండల వనరుల కార్యాలయంలో ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం మండలాధ్యక్షుడు దయానంద్ మాట్లాడారు. ఏడాది కావస్తున్నా హామీ అమలు చేయలేదని ఆరోపించారు. రెగ్యులర్ చేయకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కరుణాకర్, గోవర్దన్, నర్సింహులు, స్వప్న, కవిత, రమాదేవి, పోచమ్మ పాల్గొన్నారు.



హుస్నాబాద్: నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

వర్గల్ క్షేత్రం.. దేదీప్యమానం

వర్గల్(గజ్వేల్): తొగుట పీఠాధిపతి శ్రీమాధవానంద సరస్వతి స్వామి శ్రీచంద్రమౌళీశ్వరాలయంలో శనివారం మహన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. హారతి ఇచ్చి సామూహిక కార్తీక లక్ష దీపోత్సవానికి అంకురార్పణ చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి, మర్పడగ సంతాన మల్లికార్జున క్షేత్ర వ్యవస్థాపకుడు డాక్టర్ చెప్పెల హరినాథశర్మ నేతృత్వంలో సామూహిక కార్తీక దీపోత్సవం మొదలైంది. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని కార్తీక దీపాలు వెలిగించారు.



కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

విద్యార్థులు మృతి చెందినా పట్టించుకోరా?



చిన్నకోడూరు(సిద్దిపేట): మాట్లాడుతున్న సంజీవ్

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సంజీవ్

చిన్నకోడూరు(సిద్దిపేట)/చేర్యాల(సిద్దిపేట)/బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్ర వ్యాప్తంగా హాస్టళ్లు, గురుకులాల్లో ఆహారం కలుషితమై విద్యార్థులు మృతి చెందుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్ డిమాండ్ చేశారు. విద్యాసంస్థల బంద్‌లో భాగంగా శనివారం చిన్నకోడూరులో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫుడ్ సేఫ్టీ అధికారులు పాఠశాలల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలన్నారు. తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించి, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాజు, బాబు, విద్యార్థులు పాల్గొన్నారు. చేర్యాలలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఘటనలపై ప్రభుత్వం స్పందించాలని, లేని పక్షంలో ఆందోళనలు ముమ్మరం చేస్తామని హెచ్చరించారు. బెజ్జంకిలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మధు మాట్లాడారు. అక్షయ్, బన్ని పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మరకత లింగేశ్వరుడికి పూజలు

హుస్నాబాద్: మాస శివరాత్రి సందర్భంగా స్థానిక కాశీ మరకత లింగేశ్వర ఆలయంలో శనివారం రాత్రి మహాలింగార్చన నిర్వహించారు. పుట్టమట్టితో తయారు చేసిన 360 శివ లింగాలు, పిండితో తయారు చేసిన 360 దీపాలను లింగాకారంలో రూపొందించారు. మహిళలు దీపాలు వెలిగించి హారతి పట్టారు.

◆ నేడు కిష్టయ్య వర్ధంతి

సిద్దిపేటకమాన్: మలి దశ తెలంగాణ ఉద్యమ అమరుడు పోలీస్ కిష్టయ్య వర్ధంతిని జిల్లా కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహిస్తామని తెలంగాణ పోలీస్ ఫోరం అధ్యక్షుడు శ్రీశైలం తెలిపారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తెలంగాణ అమర వీరుల స్తూపం నుంచి పోలీస్ కిష్టయ్య విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో తెలంగాణ ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహులు పాల్గొన్నారు.

◆ కరపత్రాల ఆవిష్కరణ

చేర్యాల(సిద్దిపేట): గజ్వేల్‌లో డిశంబర్ 1, 2 తేదీల్లో జరగనున్న సీపీఎం జిల్లా మూడో మహా సభలకు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని మండల కార్యదర్శి బండకింది అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. కడవేర్గు, పోతిరెడ్డిపల్లి, పెద్దరాజుపేట, నాగపురి, శబాష్‌గూడెం గ్రామాల్లో జిల్లా మహాసభ కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఆయన వెంట కనకయ్య, ఇంద్రం, దేవేందర్‌రెడ్డి, రమేశ్, బాలు, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ హుస్నాబాద్ సర్వే పూర్తి

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండల ఇంటింటి కుటుంబ సర్వే పూర్తి చేయడంతో పాటు డేటా ఎంట్రీ ప్రక్రియ పూర్తిచేసినట్లు తహసీల్దార్ రవీందర్‌రెడ్డి శనివారం తెలిపారు. మండలంలోని 17గ్రామాల్లో 7,517 కుటుంబాలు ఉండగా పట్టణంలో 6,640 కుటుంబాల డేటా ఎంట్రీ పూర్తి చేశామని చెప్పారు. మరో 800 కుటుంబాల డేటా ఎంట్రీ కొనసాగుతోందని తెలిపారు.

◆ హెచ్‌ఐవీకి నివారణ ఒక్కటే మార్గం

గజ్వేల్‌రూరల్: హెచ్‌ఐవీకి నివారణ ఒక్కటే మార్గమని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కమలా క్రిస్టియాన అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్ఎస్ వలంటీర్లు, రెడ్ రిబ్బన్ క్లబ్ సంయుక్తంగా శనివారం ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జయరాజు, కస్తూరిబాయి, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ శ్రీలత పాల్గొన్నారు.

◆ పదవీ విరమణ తప్పనిసరి

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరి అని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ డాక్టర్ నందిని సిద్దారెడ్డి అన్నారు. ఎంపీడీఓ కుమారస్వామి పదవివిరమణ సందర్భంగా మండలంలోని కిష్టపేటలోని ఓ పంక్షన్ హాల్లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం జెడ్పీ సీఈఓ రమేశ్ మాట్లాడుతూ పదవి విరమణ అనంతరం ఉద్యోగులు సంబంధాలు కొనసాగించాలన్నారు. రాజు, ఎంపీఓ శ్రీనివాస శర్మ, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

◆ సీఎం దృష్టికి రెవెన్యూ డివిజన్

దుబ్బాక: దుబ్బాక రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులను కలిసి తప్పకుండా సాధించుకునేందుకు కృషి చేస్తానని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు శ్రీనివాస్‌రెడ్డిని కలిసి రెవెన్యూ డివిజన్ ఏర్పాటకు చర్యలు తీసుకోవాలని శనివారం వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అనంతుల శ్రీనివాస్, శ్రీరాం నరేందర్, రవి, వెంకటస్వామిగౌడ్, వెంకటేశం, సాయితేజగౌడ్ తదితరులు ఉన్నారు.

◆ వినతులకు ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీసీ రిజర్వేషన్‌లపై కుల సంఘాలు, సంక్షేమ సంఘాల నుంచి వినతులకు ఆహ్వానం పలుకుతున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి షేక్ అహ్మద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్‌పై అభ్యర్థనలు, సలహాలు అందించాలని తెలిపారు. సంగారెడ్డిలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10నుంచి సాయంత్రం 4 వరకు వినతులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

◆ మెరుగైన బోధనే లక్ష్యం

కొండపాక(గజ్వేల్): పాఠశాలల్లో మెరుగైన బోధనలే లక్ష్యంగా సాగాలని ఎంఈఓ బచ్చలి సత్తయ్య ఉపాధ్యాయులకు సూచించారు. కుకునూరుపల్లి మండలంలోని తిప్పారం ప్రాథమిక పాఠశాలను శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఉత్తీర్ణతా శాతం పడిపోతే పాఠశాలల నిర్వహణ కష్టతరంగా ఉంటుందనే విషయాన్ని ఉపాధ్యాయులు గమనించాలన్నారు.